# మరో బానిస

డా. ముక్తేవి భారతి

అమ్మాయి చాలా బావుందని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. తాంబూలాలు, పెళ్లి వేడుకలు ఒకటొకటి త్వరత్వరగా అయిపోయాయి. అందాలరాశి అత్తవారింట్లో అడుగుపెట్టింది. పెదవి విప్పితే అలసిపోతుందని, కాలు కదిపితే కందిపోతుందని, క్షణ క్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటూ, పూలల్లో పెట్టి పూజించేసాడు రామం.

నెల రోజులు గడిచాయి. అందాలరాశికి తెల్లారిన దగ్గర నుంచీ విసుగ్గానే వుంది ఆ రోజు.


"నేను మా వాళ్ల యింటికి వెడతాను" - జానీ, అదే జానకి అంది ముద్దు ముద్దుగా పడగ్గదిలోంచి బయటకొస్తున్న తన జీవిత భాగస్వామితో.

"అప్పుడేనా - అయినా నువ్వెడితే నేనెలా వుంటాను" గుండెలకి హత్తుకున్నాడు.

"కావాలంటే మీరూ రండి" రివ్వున గదిలోంచి బయటకెళ్లిపోయింది జానీ.

* * * *

ఆఫీసునించి ఇంటికొచ్చిన రామానికి కాఫీ గ్లాసు చెల్లెలందిస్తుంటే చాలా చిరాకనిపించింది. గబగబా తాగేసి, పది నిమిషాల్లో బయలుదేరాడు రామం.



దగ్గర్లోనే వున్న అత్తవారిల్లు మరి దూరంగా అనిపించింది.

'జానీ' - గుమ్మంలో కొస్తూనే పిలిచాడు.

మరదలు ఎదురొచ్చింది. 'కూర్చోండి వస్తూంది' -

రామం కూర్చున్నాడు - కూర్చున్నాడు -కూర్చున్నాడు!!

'ఇంట్లో లేదా' - రామం లోపల గదిలో అడుగుపెట్టాడు. "ఊ -రండి" - సోఫాలో పడుకుని పత్రిక తిరగేస్తోంది జానీ. ఒక్క నిమిషం విస్తుపోయాడు. ఉన్నట్టుండి ఏమైంది!!

"నేనా యింటికి రాను బాబూ 'గారాబంగా దీర్ఘం తీసింది

"అంటే" -

'అదే - అబ్బ, ఆ ఇంట్లో అంతమందిలో నేనుండలేను' -

రామం షర్టు బటన్సు సరి చేస్తోంది.

"అంటే -

అదే - బోర్ - ఇలా చూడండి, ఇలా -' జానీ 'చేతిలో ఉన్న పత్రిక వంక చూసాడు రామం.

సోఫాలో కూచున్న భార్య, భర్త - కాళ్ల దగ్గర చిన్న కుక్కపిల్ల - పక్కగా చక్కని టెలిఫోన్ - ఫ్లవర్‌వాజ్ - రామం పకపకా నవ్వాడు.

'ఏమిటా నవ్వు - అవును ఇలా వుండాలి - చిలకా గోరింకల్లా'

"ఊ" - రామం ఎటో చూస్తున్నాడు. సమస్య అర్థమయిపోయింది. చిన్న వయసులో పెద్ద ఉద్యోగం తెచ్చుకున్న తెలివైన రామం విషయాన్ని గ్రహించటం కష్టంకాదు.

"ఏం చేద్దామంటావ్" -

"యూ సిల్లీ - నే చెప్పాలా' రామం చెంపలు నిమిరింది. జుట్టు సవరించింది.

"ఊ - చెప్పండి" - జానీ రామం ముఖంలోకి చూస్తోంది.

సహజంగా ఎవరినీ ఎదిరించలేడు. గట్టిగా మాట్లాడలేడు. అందాలరాశిని, అర్థాంగిని ఏమంటాడు - రామం ఆ రాత్రి అక్కడే వుండిపోయాడు. తెల్లారి అక్కడ నుంచే 'ఆఫీసుకెళ్లిపోయాడు.

* * * *

'అదేమిటిరా - అలా చెప్పకుండా ఇద్దరు ఇంటికి రాకపోతే నేను, నాన్న మీ కోసం ఎంతసేపు ఎదురు చూస్తాం, ఎంతసేపు మీ కోసం భోజనం చేయకుండా కూచుంటాం -' ఇంట్లో అడుగుపెడుతుంటే తల్లి గొంతు.

"ఏది మీ ఆవిడ" -

రామం మాట్లాడలేదు -

ప్రస్తుతం వలలో చిక్కుకున్నాడు. బయటకు రావటం తేలిక కాదు - ఒక బంధం దూరం చేసుకుని, ఒక బంధం దగ్గర చేసుకోవాలి - ఏది, ఏది?? -

తనని ఈ స్థితికి తేవడానికి నాన్న పడ్డ కష్టాలు - తనకి తెలుసు. తన తమ్ముడికి చదువు, చెల్లెలికి పెళ్లి చేయటంలో తనకున్న బాధ్యత తనకి తెలుసు -

అయినా కన్న ప్రేమకి దూరమవటమా -

భార్యకి దాసుడవటమా -

రాత్రంతా నిద్ర పట్టని రామం తెల తెలవారుతుండగా తండ్రి గదిలో అడుగుపెట్టాడు.


'నాన్న' - రామం గుండె దడ దడలాడుతోంది.

'చెప్పు' - ఏమిటి విశేషం -

రామం మాట్లాడలేదు.

'ఈనాటి వరకు పెరిగిన బంధాన్ని కట్ట కట్టి గుండెల్లో అట్టడుగున పడేయాలనుకుంటున్నాను -

అందమైన గూడు కట్టుకుని మనసు చంపుకు



# మరో బానిస

బతికేయాలనుకుంటున్నాను - రామం గుండె దాటి బయటికి రాలేదు'ఈ మాటలు

'ఏమిటో చెప్పు' - తండ్రి రామం ముఖంలోకి చూసాడు ముఖం పక్కకు పెట్టుకునే ఉన్న విషయం చెప్పాడు రామం తండ్రి మాట్లాడలేదు - రామం మాట్లాడలేదు గదిలో నిశ్శబ్దం భయమేస్తోంది.

"నీ యిష్టం" - ఒక్కటే మాట తండ్రి గొంతు నుంచి.

రామం ముఖం వెల వెలపోయింది. ఇది మరి బాధగా వుంది అయినా వారం రోజులు తిరక్కుండానే రామం వేరుపడిపోయాడు.

రంగు రంగు కర్టెనులు, పూల పూల దుప్పట్లు, అందమైన సోఫాలు, - అలంకరించిన ఇంట్లో అడుగు పెడుతుంటే చీకట్లో అడుగు పెడుతున్నట్లుగా ఒక్కసారి భయమేసింది రామానికి

* * * *

వారం వారం తండ్రిని చూడడానికి వచ్చేవాడు మొదట్లో రామం నెమ్మదిగా ఏ నెలకో ఓసారి రావటం మొదలైంది

'ఇద్దరం వెడదామా' - నసిగాడు ఓ సాయంత్రం.

'అబ్బ, బోర్ - మీరెళ్లండి' -

'నువ్వు ఒక్కర్తివీ ఎలా వుంటావ్ - నేనూ వెళ్లనులే' సిగరెట్టు ముట్టించాడు, తమ్ముడికి ఫీజు కట్టడానికి డబ్బు తక్కువైతే, తన స్నేహితుడు అప్పివ్వడం చూస్తూనే ఊరుకున్నాడు చెల్లెలు పెళ్లయితే అందరితో పాటు వెళ్లి వచ్చేసాడు . ఎక్కడో గుండె పట్టుకుంటోంది! - కానీ ఆ రోజు రామం అలా అరుస్తాడని ఊహించని జానీ విస్తుపోయింది.

"నీకెంత బానిసనయినా మనిషినే - మరిచిపోకు - నా తండ్రి పుట్టినరోజు కెళ్లడానికి నీ పర్మిషన్ కావాలా' - జానీ ఏదో అనబోయి నోరు వెంటనే మూసేసుకుంది రామం మెట్లు దిగి గబగబా వెళ్లిపోతుంటే, చూస్తూ నిలుచుంది జానీ చాలాసేపు

* * * *

"మమ్మీ - ఇది విషయం" - ముక్కు తుడుచుకుంది జానీ

"మరేం ఫరవాలేదు - సాయంత్రానికి వచ్చేస్తాడు చూడు నిన్నొదలి అతనేం చేస్తాడూ" - దీర్ఘం తీస్తూ, సిగపిన్నులు సర్దుకుంది తల్లి.

వారం రోజులయింది. రామం ఆఫీసు నుంచి తిన్నగా తండ్రి ఇంటికెడుతున్నాడు. ఆ రోజు ఆఫీసుకొచ్చిన జానీని చూసి ఆశ్చర్యపోయాడు రామం.

'ఏమిటిలా వచ్చావ్'

"మాట్లాడాలి' -

రామం సెలవు చీటీ ఇచ్చేసి బయటకొచ్చేసాడు

హోటల్లో కూచున్నారు.

మా వాళ్లేం అంత గతిలేని వాళ్లు కారు.'

'అంటే" -

'అదే - మా అమ్మ చెప్పమంది - మీరక్కడ నేనిక్కడ బాగాలేదు - ఏదో తేల్చుకుందామని" - అందంగా వుండే జానీ కళ్లు ఎరుపెక్కటంతో మరి అందంగా కనిపిస్తోంది

విడిపోదామనా" రామం నవ్వాడు.

'అవును - మనసులు కలవకుండా ." చిన్న కర్చీఫ్‌తో కళ్లొత్తుకుంది జానీ

"సాయంత్రం ఇంటికొచ్చేయ్' -

'మీరే రండి' - రక్కున లేచి వెళ్లిపోయింది జానీ

* * * *

'మీ మామగారొచ్చారు' - తండ్రి గదిలో నుంచే అన్నారు

'ఏమంటాడు'

'ఏమో - నాకేం అర్థంకాలే' -

"కానీ ఒక్క మాట విను, సాయంత్రం వెళ్లి ఆ అమ్మాయిని తీసుకుని నీ యింటికి నువ్వెళ్లు" - తండ్రి గొంతు గంభీరమైంది మరో మాటకి అవకాశంలేదు రామం గొంతు పూడింది!

అంతే - అదే రామం జీవితంలో మలుపు.

* * * *

కాలం గబగబా పరిగెడుతోంది -

రామం జుట్టులో ఒకటొకటి తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయి

"బజారు వెడదామా'

'నీ యిష్టం'

సినిమాకెడదాం -

'నీ యిష్టం'

అన్నం తినండి'

'నీ యిష్టం' -

'డాడీ, మీకు యిష్టం లేకపోయినా రావాల్సిందే - మమ్మీకి కోపమొస్తుంది" - పదిహేనేళ్ల రాజీ మాటలకి

'మీ యిష్టం' - రామం షర్టు తొడుక్కుని సిద్ధమవుతున్నాడు -

'మీకు తెలియదు - ఊరుకోండి" - జానీ కూతురు పెళ్లి విషయాలు తనే మాట్లాడుతుంది

'ఊ - సరే' - రామం చెప్పులు తొడుక్కుని జానీ వెంట నడుస్తున్నాడు

జుట్టుకు రంగేసుకోవోయ్ అంటున్నారు స్నేహితులు నిజంగానే రంగు వేసుకోవాలని తనకి వుంది కానీ,

'డై చాలా ఖరీదయిపోయింది - రంగు అనవసరం' జానీ పెదాలకు లిప్‌స్టిక్ పూసుకుంటోంది అద్దం ముందు నిలబడి.

"నిజమే - రంగు చాలా ఖరీదయిపోయింది వేసుకోను ఆ అద్దం ముందే నిలబడి తల దువ్వుకున్నాడు రామం

* * * *

ఎప్పుడైనా ఒంటరిగా డాబామీద చల్లగాలికి తిరుగుతుంటే ఎన్నో ఏళ్లనాడు, నీ యిష్టం అని తండ్రి అన్న మాట, ఆ గంభీరమైన గొంతు చెవికి వినిపిస్తుంది రామానికి ఆ నిముషం ఓ దీర్ఘమైన నిట్టూర్పు అలా గాలిలో గలిసిపోతుంది అంతే" □


తెలుగు నవల అమ్మకాల్లో ఇప్పటి వరకూ రికార్డు... తులసిదళం

విడుదలైన మొదటి నెలలో తులసిదళం అమ్మకాల్ని అధిగమించిన నవల...

మరణమృదంగం

రూ. 30/-

నవభారత్ బుక్ హౌస్, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

CHANDRA